## నిర్లక్ష్యం వహిస్తే సహించ: జిల్లా కలెక్టర్ అన్సారియా

**ఒంగోలు, ప్రభాతవార్త**



మీ కోసం కార్యాలయంలో వచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి ఒక్క అర్జీ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని ఆదే ఆదేశించారు. అధికారులు, ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని ఆమె చెప్పారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు ఇప్పుడే స్పష్టం చేయాలన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.చిన్న ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, మాధురి, డిప్యూటీ కలెక్టర్ పార్ధసారధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి - బిఆర్ గౌస్ డిమాండ్

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి, ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బిఆర్ గౌస్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో పేదల ఆరోగ్య సంజీవని ఆరోగ్యశ్రీ కాస్తా అనారోగ్యశ్రీగా మారిందని, పేదోడి ఆరోగ్యానికి భరోసా లేకుండా పోయిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గించడం సిగ్గుచేటని, తక్షణమే ఆసుపత్రులు యాజమాన్యాలతో చర్చించి ఆరోగ్యశ్రీ సేవలు అందించాలన్నారు.

## డ్రోన్ వర్క్‌షాప్ ప్రారంభం

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఐటి, రూర్కెలా సౌజన్యంతో డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభం అయ్యింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న బిఐటి మిశ్రా ప్రొఫెసర్ కౌశిక్‌కుమార్ మాట్లాడుతూ పలు రంగాలలో డ్రోన్ టెక్నాలజీ వినియోగంలో వుందని, సత్ప్రయోజనాల కోసం డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించాలని మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ విజయవాడలో వరదలు సమయంలో పోలీసుల నిఘాకు, సహాయక చర్యలకు డ్రోన్ వ్యవస్థ ఉపయోగపడటం కళ్లారా చూశామన్నారు. కార్యక్రమానికి ఎన్ఐటి ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ సంధానకర్తగా వ్యవహరించగా క్విస్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, డీన్‌లు డాక్టర్ భార్గవ, ప్రొఫెసర్ చల్లా రామ్, హెచ్ఓడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బౌద్ధ భిక్షువులచే విశ్వశాంతి మహాహోమం

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



జపాన్, శ్రీలంక దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు యుషి, హీన్‌దేరో స్థానిక అన్నవరప్పాడులోని శివం శరణాలయం సందర్శించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన మహా రుద్రాభిషేకం, విశ్వశాంతి మహాహోమం తిలకించి శరణాలయానికి గోవు దానం, అన్నదానం చేసి, పేద కుటుంబాలకు జీవనోపాధికై రూ.40వేలు సాయం అందించారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ అధ్యక్షులు గొల్లపూడి శ్రీహరి, మానవతా సేవా సంస్థ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, రాజేశ్వరి, నాగరాజు, సురేష్, తిరుమల, సులోచన, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లోకి అధునాతన ఫీచర్లతో అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కారు...

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**




టొయోటా కిర్లోస్కర్ మోటార్ సోమవారం అర్బన్ క్రూయిజర్ హైరైడర్లో భద్రత, సౌకర్యం సౌలభ్యాన్ని పునర్నిర్వచించే ఫీచర్ అప్గ్రేడ్లను ప్రవేశపెట్టారు. భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్, ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎసువిగా గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే 1 లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటింది. అర్బన్ క్రూయిజర్ హైరైడర్లో ఇప్పుడు ప్రధానంగా మెరుగైన భద్రత ఫీచర్లు జోడించబడ్డాయి. ప్రయాణికుల భద్రతను నిర్ధారిస్తూ 6 ఎయిర్బ్యాగ్లు, ఇప్పుడు అన్ని వేరియంట్లలో ప్రామాణికంగా ఉన్నాయి. అలాగే ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్కు ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ జోడించబడింది. సౌకర్యం కోసం 8వే అడ్జస్టబుల్ పవర్ డ్రైవర్ సీట్, యాంబియంట్ లైటింగ్, క్యాబిన్ లోపల మెరుగైన గాలి నాణ్యత పర్యవేక్షణను నిర్ధారిస్తూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ డిస్ప్లే జోడించబడింది. సేల్స్ సర్వీస్‌యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా మాట్లాడుతూ "ఎస్యువిఖి సెగ్మెంట్ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, మేము మా శ్రేణిని మెరుగు పరుస్తూనే ఉన్నాము. తాజా అర్బన్ క్రూయిజర్ హైరైడర్ అనేది అత్యుత్తమ సాంకేతికత, అధునాతన భద్రత, ఉన్నతమైన సౌకర్యం అందించాలనే మా నిబద్ధతకు నిదర్శనం అన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కోసం బుకింగ్లు ఇప్పుడు తెరవబడ్డాయి. కస్టమర్లు తమ సమీప టొయోటా డీలర్షిప్ను సందర్శించవచ్చు లేదా ఆన్లైన్లో బుక్ చేసుకోవచ్చని తెలియజేశారు.

## నల్లూరి ట్రస్టు ద్వారా కంప్యూటర్లు అందజేత

**చీమకుర్తి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**



చీమకుర్తి తహశీల్దారు వారి కార్యాలయంనకు రోజువారి వచ్చు వివిధ రకాల అప్లికేషన్లను పరిష్కారానికి అవసరమైన నాలుగు కంప్యూటర్లను కె.వి పాలెం గ్రామ వాస్తవ్యులైన ఎన్ఆర్ఐ నల్లూరి వెంకట శేషయ్య అందజేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ల అవసరం ఉందని వారి దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే స్పందించి నల్లూరి ఫౌండేషన్ ద్వారా సోమవారం నాలుగు కంప్యూటర్లను తహసిల్దార్ బ్రహ్మయ్య కు అందజేశారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకట శేషయ్య మాట్లాడుతూ చీమకుర్తి మండల పరిధిలోని రైతులు,ప్రజలు మరియు విద్యార్థులకు వివిధ సర్టిఫికెట్లు మంజూరు చేయు విషయంలో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు తమ ట్రస్ట్ తరుపున 4 కంప్యూటర్లు అందజేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా విద్యార్థులు, రైతులు, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో తమ ట్రస్టు తరుపున సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు బ్రహ్మయ్య నల్లూరి ట్రస్ట్ తరపున కార్యాలమునకు అడిగిన వెంటనే కంప్యూటర్లు అందజేసినందుకు నల్లూరి వెంకట శేషయ్య కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు మన్నం ప్రసాద్, చీమకుర్తి మండల టిడిపి అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కందిమల్ల గంగాధర్, నాయకులు కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి వెంకట రాంబాబు, రామినేని యోగయ్య, వేల్పుల వెంకటేశ్వర్లు, నీటి సంఘాల డీసీ అధ్యక్షులు పాలడుగు వెంకట నారాయణ, కె.వి పాలెం సర్పంచ్ బక్కా శ్రీనివాసరావు మరియ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

**దర్శి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



కురిచేడు మండలం బోధనంపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో ఎక్సైజ్ అధికారులు ఆగ్రామంలో దాడులు చేపట్టారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తన సిబ్బందితో కలిసి దాడులు చేపట్టి అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న కంకణంపాటి ఆంజనేయులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నా. ఈ దాడుల్లో ఎస్సై సత్యనారాయణరావు, సిబ్బంది కాశింపీరా, నాగరాజు, ఎస్.శ్రీనివాసులు ఉన్నారు.

### అమెరికా సుంకాల నేపథ్యంలో

# జిల్లాలో ఆక్వా సంక్షోభం



*- డాలర్ పంట.. ట్రంప్‌తో తంటా..*

*- నిలిచిన పెద్దకౌంట్ రొయ్యల కొనుగోలు*

ఒంగోలు, ప్రభాతవార్త

రాష్ట్ర వృద్ధి రేటులో కీలక భూమిక పోషిస్తున్న ఆక్వా రంగం సంక్షోభంలో పడింది. డాలర్ల పంటగా పేరుగాంచిన ఈ రంగం నేడు అదే డాలర్‌తో ముడిపడిన సుంకాల సమస్యలతో కొట్టుమిట్టాడు తుంది. ఆక్వా ఉత్పత్తులపై 2-3శాతం ఉంటే అమెరికా దిగుమతి సుంకం ఏకంగా 26శాతానికి పెరగడంతో ఇక్కడ ధరలు పతనమయ్యాయి.ఏటా రెండు సీజన్లో 30 వేల టన్నుల మేర పంట ఉత్పత్తి అవుతుంది. జిల్లాలో ఒంగోలు,కొత్తపట్నం,నాగులుప్పలపాడు, టంగుటూరు,సింగరాయకొండలో 18వేల ఎకరాల్లో ఆక్వా సాగవు




తుంది. ఆక్వా రైతులు 5వేల మంది వరకు ఉన్నారు. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు 25 వరకు జిల్లాలో ఉన్నాయి. చెరువులపై నిరంతరం పది వేల మంది పని చేస్తుంటారు. కొత్తపట్నం మండలంలోని రాజుపాలెం,గవ్వళ్ళపాలెం,వద్దిరెడ్డిపాలెం, ఈతముక్కల, మడనూరు ప్రాంతాల్లో హెచరీలు ఉన్నాయి. నాణ్యమైన రొయ్యపిల్లల లభ్యత కారణంగా పొరుగు జిల్లాల రైతులు ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. హేచరీలలో దాదాపు 12వేల మంది జిల్లాలో ఉన్న ఐదు ప్రాసెసింగ్ ప్లాంట్ల వద్ద దాదాపు 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు. జిల్లాలోని తీర ప్రాంతాల మండలాల్లో ఆక్వా సాగు ఎక్కువగా సముద్ర, ఆటుపోట్ల కారణంగా కాలువల్లో ఉప్పు నీటి నీటి లభ్యత పుష్కలంగా ఉంటుంది. దీంతో ఏటా రెండు సీజన్లో పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం టైగర్ రకం ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే పంటలలో 90శాతం విదేశాల ఎగుమతి అవుతుంది. అందులో సింహ భాగం అమెరికాకే వెళ్తుంది. పెద్ద కౌంట్(20,30,40) రొయ్యలు అక్కడికి పంపిస్తున్నారు. తరువాత ప్రాధాన్యంగా జపాన్, చైనా తదితర దేశాలకు పంపిస్తున్నారు.తద్వారా ప్రభుత్వానికి సుమారు 3వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం లభిస్తుంది. ఆర్థికంగా ఆక్వా రంగానిదే పైచెయ్యి, ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంఫ్ దిగుమతి సుంకాలను భారీగా పెంచడంతో జిల్లాలో చేతికి వచ్చిన టైగర్ రొయ్య,వనామి రొయ్యలనుకొనుగోలు చేసే నాధుడే కరువయ్యారు. వారంరోజులుగా జిల్లాలో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అమెరికా సుంకాల దెబ్బకు ధరలు పతనం కావడంతో కొనుగోలు దారులు లేక రొయ్యలను పెట్టుబడి పెట్టలేక చెరువుల్లో ఉంచి అదనపు పెట్టుబడి పెట్టలేక ఆందోళన చెందుతున్నారు. సాగు దారుల నుంచి వ్యాపారులు రొయ్యలు కొనుగోలు చేసి జిల్లాలోని ప్రాసెసింగ్ ప్లాంట్లతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కృష్ణ,నెల్లూరు ప్లాంట్లకు పంపిస్తున్నారు. ప్లాంట్లను రొయ్యలను శుద్ధి చేసి శీతలీకరించి ఏసీ కంటైనర్లలో కృష్ణపట్నం, కాకినాడ, గంగవరం, చెన్నై పోర్టులకు తరలించి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రైతులు పండించే రొయ్యల్లో 90 శాతానికి పైగా విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. జిల్లా నుంచి అమెరికా, చైనా, జపాన్, దుబాయ్, సౌదీఅరేబియా, కోవైట్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. విదేశాలకు ఎగుమతి అయ్యే రొయ్యల్లో సింహభాగం వాటా అమెరికాదే. చైనాకు 100 నుంచి 150 కౌంట్‌వి ఎగుమతి అవుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో నాన్ ఆక్వా జోన్ పేరుతో కరెంటు రాయితీ ఎత్తివేయడంతో మార్కెట్లో రొయ్యల ధరలు పడిపోయాయి. సాగు దారులు భాగా నష్టపోయారు. ట్రంప్ అమెరికాకు ఎగుమతి అయ్యే భారతి ఉత్పత్తిలపై సుంకాలు ఎక్కువ విధించడంతో ఇప్పటి వరకు ఆక్వారంగంలో ఉన్నసానుకూల పరిస్థితులు తలకిందులు అయ్యాయి.ఒక్కసారిగా కిలో రొయ్యల ధర రూ.40కి పడిపోయింది. వంద కౌంట్ ధర 200లకు దిగజారింది. రొయ్య రైతులకు వంద కౌంట్‌లో కిలో రొయ్యల ఉత్పత్తికి రూ.230ల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం ధర కొనసాగితే కిలో రూ.40చొప్పున ఎకరాకు ఒక సీజన్‌కు రూ.80వేలు చొప్పున సాగు దారులు నష్టపోతారు. అదే పెద్ద కౌంట్ రొయ్యలకు అయితే నష్టాలు లక్షల్లో వస్తుంది. ఇప్పటికే రొయ్యల సాగు ప్రారంభించిన వారు తమ పరిస్థితి ఎంటని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఆక్వా సాగు చేసే సముద్ర తీర ప్రాంతాల్లో సుమారు 12 వేల ఎకరాలు ఉంది. జిల్లా నుంచి ఏటా విదేశాలకు ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల విలువ కోట్లలోనే ఉంది. ఎగుమతుల్లో అమెరికా వాటా 50శాతం పైనే ఉందని తెలుస్తోంది.ఈ నిర్ణయంతో సాగుదారులపైనే కాదు,ఈ రంగంపై ఆధార పడ్డ కూలీల ఉపాధికి కూడా దెబ్బేనని విశ్లేషకులు అంటున్నారు.

## ప్రతి నిత్యం ప్రజల్లో ఉండాలి : ఉగ్ర

*- కార్యకర్తలకు సూచనలు, సలహాలు అందించిన ఎమ్మెల్యే ఉగ్ర*

పామూరు, ప్రభాతవార్త



గ్రామ కమిటీ నాయకులు ప్రభుత్వం వచ్చిందిలే అని ఇక మనకు ప్రజలతో పనేముందిలే అనుకోకుండా ప్రతినిత్యం ప్రజలతో మమేకమై వారి సాదర బాధలు తెలుసుకుని వారికి అవసరమైన పనులు చేయించేందుకు నూతన ప్రణాళికలు రచించాలని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కోరారు. సోమవారం స్థానిక శేషమహల్ థియేటర్ ఆవరణలో మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన మండలంలోని గ్రామ స్థాయి అధ్యక్షులతో పాటు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ ఇన్‌ఛార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి కమిటీ అధ్యక్షులు ఇలాగే కొనసాగాలనుకుంటే కొనసాగించవచ్చని, లేదంటే కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటే అది మీ ఆధ్వర్యంలోనే జరగాలని అన్నారు. అదే విధంగా ప్రతి 60 ఇళ్లకు ఒక ఇన్‌ఛార్జిని నియమించి వారి ద్వారా ప్రజలకు అవసరమైన పథకాలు, ఇతర కార్యక్రమాలు అయిన సరైన సమయంలో అందేలా చూడాల్సిన బాధ్యతలను తీసుకోవాలన్నారు. కష్టించి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని, అందుకు ఉదాహరణకు యారవ శ్రీనివాసులు సతీమణికి కనిగిరి ఏఎంసీ ఛైర్మన్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా కూటమి అభ్యర్థులు అయిన జనసేన, బీజేపీ వారికి అన్ని నామినేటెడ్ పదవుల్లో తగిన విధంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఈరోజు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు వేలాది కోట్ల రూపాయలతో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తరువాత వేయగలిగామంటే అది చంద్రబాబునాయుడు వలనే సాధ్యమైందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయాన్ని అభివృద్ధి గావించేందుకు ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, పట్టణ అధ్యక్షులు ఖాజా రహంతుల్లా, లక్ష్మీనరసాపురం ఎంపీటీసీ, యువనేత బొల్లా నరసింహారావు చౌదరి, గుంటుపల్లి శ్రీనివాసులు, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ మెంబర్లు ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, జిల్లా మైనార్టీనాయకులు సయ్యద్ అమీర్ బాబు, గోళ్ళ యోగానంద్, సాంబయ్య, ఆర్ఆర్ రఫీ, మాచర్ల రహిమాన్, మొబినా మౌలాలి, పాలపర్తి వెంకటేశ్వర్లు, యువనేత నరసింహరావు, పువ్వాడి రామారావు, మద్దిశెట్టి రమాదేవి, రమణమ్మ, వాయినేని రాఘవ, కంభాలదిన్నె గ్రామ కమిటీ అధ్యక్షులు మన్నం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి రంగాల వైపు యువత మొగ్గు చూపాలి

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**బల్లికురవ, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



గ్రామీణ ప్రాంతాల్లోని యువత, స్వయం ఉపాధి రంగాల వైపు మొగ్గుచూపితే గ్రామీణ ప్రాంతాలు పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధిస్తాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వేమవరం పారిశ్రామిక వాడలో మారుతి గ్రానైట్ కర్మగారాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిపుచ్చే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ యువత పరిశ్రమ ఏర్పాటు పట్ల మొగ్గుచూపితే మరికొందరు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మహాకూటమి ప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు అనేక ప్రోత్సాహక రాయితీలను ప్రకటిస్తుందని వీటిని అందిపుచ్చుకొని విద్యావంతమైన యువకులు రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుక్కపల్లి సారధి, టీడీపీ యువ నాయకులు గొట్టిపాటి కమల్ కిషోర్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ జస్ట్ వెంకట నారాయణబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ మలినేని గోవిందరావు, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, కోయి పేరయ్య, సీనియర్ నాయకులు దేవినేని శివయ్య, తెలుగు యువత అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతరావు, అడుసుమల్లి శ్రీహర్ష, మాజీ ఎంపీటీసీ ఆళ్ల చంద్రమౌళి, యాగంటి సింగరయ్య, ఎస్సీ సెల్ నాయకులు కత్తి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పున్నారెడ్డిని పరామర్శించిన మంత్రి గొట్టిపాటి

**కొరిశపాడు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



టిడిపి సీనియర్ నాయకులు కొరిశపాడు గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు కనుబొద్దు పున్నారెడ్డి కుటుంబసభ్యులను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పరామర్శించారు. గతవారం పున్నారెడ్డి భార్య పున్నమ్మ ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఉదయం గ్రామానికి వచ్చి పున్నారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితోపాటు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు భవానీ ప్రసాదరెడ్డి, పున్నారెడ్డి సోదరుడు శశి రెడ్డి గ్రామస్థులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులు అరెస్టు

*- నాలుగు కేజీల 550 గ్రాములు గంజాయి స్వాధీనం*

*- నిందితులును రిమాండ్‌కు తరలింపు*

*- యువత మాదకదవ్యాలుకు బానిస కావ్వొద్దు*

**సింగరాయకొండ, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**




అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి,వారి వద్దనున్న నాలుగు కేజీల, 550 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సిహెచ్. హజరత్తయ్య తెలిపారు. సోమవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి రవాణాను నిర్మూలించాలనే లక్ష్యంతో ఎస్పీ ఏఆర్ దామోదర్ స్వీయ పర్యవేక్షణలో ఒంగోల్ డి.ఎస్.పి ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ.హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై వి.నాగమల్లేశ్వరరావు టంగుటూరు టోల్ గేట్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా టంగుటూరు గ్రామానికి వెళ్ళు సర్వీస్ రోడ్డు వద్ద సోమవారం మధ్యాహ్నం సమయంలో నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. గుంటూరుకు చెందిన గాజుల రాజు ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతూ గంజాయి కి బానిసై, తనకు ఒరిస్సాలో బీమా ఖోరా మరియు అతని స్నేహితుడు ఖాషా ఖీల అను వారి దగ్గర గంజాయి తెచ్చుకొని తాగుతు మిగిలినది చిన్న చిన్న ప్యాకెట్లు చేసి ఒంగోలు చుట్టుపక్కల అమ్ముతున్నట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలో కాళహస్తికి చెందిన కిరణ్ సుమారు నాలుగు రోజుల క్రితం గాజులు రాజుకు ఫోన్ చేసి తన ఖర్చులకు కూడా డబ్బులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నానని, మూడున్నర కిలోల గంజాయి తక్కువ రేటుకు తెప్పించినట్లయితే చిన్న చిన్న ప్యాకెట్లు చేసి శ్రీకాళహస్తిలో అమ్ముకొని ఖర్చులకు డబ్బులు సంపాదించుకుంటానని చెప్పారని అన్నారు.గాజుల రాజు ఒరిస్సా కు చెందిన ఖోరాకు ఫోన్ చేసి తనకు నాలుగున్నర కిలోల వరకు గంజాయి కావాలని ప్రకాశం జిల్లా సమీపంలోని టోల్ గేట్ వద్దకు తీసుకురావాలని చెప్పాడం తో ఒరిస్సాకు చెందిన ఖురా,ఖీలా అనువారు గంజాయి తీసుకొని ఏప్రిల్ 6వ తేదీన రాత్రి ఒరిస్సా నుండి బయలుదేరుతున్నామని రాజుకు చెప్పాడం తో కిరణ్ ను కూడా టోల్గేట్ వద్దకు రమ్మని చెప్పినట్లు వారు తెలిపారు. ఏప్రిల్ 7వ తేది మధ్యాహ్నం ఒరిస్సా నుండి గంజాయి తీసుకొని వస్తున్న ఖోరా అతని స్నేహితుడు ఖాషా ఖిలలు టంగుటూరు టోల్ గేటు వద్దకు వచ్చి కాళహస్తికి చెందిన కిరణ్ కు అతని స్నేహితుడు కిలాల్ నాలుగు గంజాయి ప్యాకెట్లు చూపించగా రాజు వాటిలో ఒక ప్యాకెట్ ను కిరణ్ కి ఇచ్చి చెక్ చేయమని చెప్పి, రెండవ ప్యాకెట్ ను రాజు పట్టుకొని చెక్ చేసి, మిగిలిన రెండు ప్యాకెట్లలో ఒక ప్యాకెట్ ఖోరా వద్ద ఉంచుకొని మరో ప్యాకెట్ ఖీల వద్ద ఉన్నట్లు వారు తెలిపారు.ఆ సమయంలో పోలీస్ వాహనం రావడం గమనించి పోలీసు వారు పట్టుకోవడానికి వస్తున్నారని, నలుగురు నిందితులు భయపడి ఒక్కొక్క గంజాయి ప్యాకెట్‌తో పారిపోవుచుండగా పట్టుకొని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులును పట్టుకొనుటలో ప్రతిభ కనబరిచిన సి.ఐ సి. హెచ్ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై. నాగమల్లేశ్వరరావు, కానిస్టేబుల్స్ ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆస్తి పన్నులో 5శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

### - మున్సిపల్ కమీషనర్ జోసెఫ్

**కనిగిరి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



కనిగిరి పురపాలక సంఘం సంబందించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమీషనర్ డానియల్ జోసెఫ్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నుల మొత్తాన్ని ఏక మొత్తంగా ఈనెల 30వ తేదీ లోపు చెల్లించిన వారికి 5 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఇంటి పన్నులు కనిగిరి పురపాలక సంఘం కార్యాలయంలో సచివాలయాల్లో చెల్లించవచ్చని తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కావున గృహ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ కోరారు.

## కేఎస్ఎం ఎడ్యుకేషన్ సొసైటీ, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంచి నీటి సదుపాయం

**కనిగిరి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



బంగారు బాల్యం వాటర్ బెల్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కేఎస్ఎం ఎడ్యుకేషన్ సొసైటీ, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాశీపురం, కాశిరెడ్డి నగర్, దేవాంగనగర్, టకారిపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. వాటర్ బెల్ కార్యక్రమం విజయవంతం చేయాలంటే, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ నీరు తాగడం యొక్క అవసరాన్ని గుర్తించి, ప్రతి గంటకు ఒకసారి నీరు తాగే అలవాటును అలవరుచుకోవాలని కేఎస్ఎం ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్, కనిగిరి పురపాలక సంఘం చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతోనే ప్రతి రోజు ఉచిత నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు వాటర్ బెల్ కార్యక్రమం యొక్క లక్ష్యం, దాని ప్రయోజనాలను గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ వివరించారు. తల్లిదండ్రులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని వాటర్ బాటిల్స్ తెచ్చుకోవడానికి ప్రోత్సహించాలని అన్నారు. మంచినీరు ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే.పద్మావతి, ఉపాధ్యాయులు ఈ.శైలజ, వి.కల్పన, ఎస్‌కే కరీమున్నిసాబేగం, ఇతర ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బంగారు బాల్యం కమిటీ సభ్యులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరక్టర్ రమేష్‌బాబు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు బహుకరణ

**కనిగిరి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



ప్రభుత్వ జూనియర్ కళాశాల కనిగిరి నందు ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ విద్యా సంవత్సరం అనగా 2025-26 అకడమిక్ విద్యా సంవత్సరం నందు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇది వరకు ఎన్నడూ లేని విధంగా కళాశాల ప్రారంభించిన రోజే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం వారు అందించినటువంటి పాఠ్య పుస్తకములు నోట్ పుస్తకములు విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉద్దేశించి ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఈ యొక్క అవకాశాన్ని అందిపుచ్చుకొని మంచిగా చదివి మంచి ప్రయోజకులు కావాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## టాక్సీ డ్రైవర్లకు ఇళ్ల స్థలాలకై సంధాని ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

**పామూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



నిరుపేదలైన టాక్సీ డ్రైవర్లకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని జనసేన సీనియర్ నేత షేక్ సంధాని ఆధ్వర్యంలో తహశీల్దార్ రమణ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఇచ్చిన హామీ మేరకు 90 కుటుంబాలకు ఇళ్ల లేక అద్దె గృహాల్లో నివాసం ముంటున్నామని, తమకు గ్రామంలో దగ్గర్లో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించినచో ఎమ్మెల్యే ద్వారా ఇళ్ల మంజూరు చేయించుకుంటామని తెలిపారు. దీనికి స్పందిస్తూ సాధ్యమైన త్వరలో గ్రామ చుట్టు పక్కల అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఎంక్వైరి చేసి ఎమ్మెల్యే ఆదేశాలమేరకు అర్హులైన ప్రతి టాక్సీ డ్రైవర్‌కు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకుపాటి వెంకటేష్ మేనకోడలు జన్మదిన వేడుకలు

**పామూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



ప్రముఖ రిలయల్డర్ ఆకుపాటి రమణయ్య కుమారుడు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ మేనకోడలు గాడి సమన్విపీణ మొదటి పుట్టిన రోజు వేడుకలు స్థానిక అనిల్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, పలువురు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హాజరై చిన్నారిని ఆశీర్వదించి చిరుకానుకలను అందించారు. మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, తిరుపతయ్య, మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ యలమందల రహిముల్లా, పట్టణ టీడీపీ అధ్యక్షులు షేక్ ఖాజారహంతుల్లా, నీరుకట్టు నాయబ్ రసూల్, పిడుగు శ్రీనివాసులు, పుప్పాల రామ్మూర్తి, వాయినేని రాఘవేంద్ర, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు సయ్యద్ అమీర్ బాబు, పువ్వాడి రామారావు, పటికమల సుబ్బారావు, అనిల్, తోట రవికుమార్, బీజేపీ కొండిశెట్టి రమణయ్య, తదితరులు చిన్నారి సమన్విపీణను దీవించారు.

## స్వగ్రామంలో గ్రామోత్సవంలో పాల్గొన్న యారవ శ్రీనివాసులు

**పామూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



నెల్లూరు జిల్లా కొండాపురం మండ లం పొట్టుపల్లి గ్రామంలో సోమవారం నాడు నిర్వహించిన సీతారాముల ఉత్స వ విగ్రహాల గ్రామోత్సవంలో కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు తన మిత్రబృందంతో పాల్గొని ఉల్లాసంగా గడిపారు. శ్రీరామనామ జపం చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. యారవ కుటుంబం ప్రత్యేకంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వగ్రామంలోని యువత, యారవ శ్రీనివాసులు అభిమానులు ఏఎంసీ పదవి దక్కినందుకు ఆయనను ఘనంగా సన్మానించారు.

## బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల

**అర్ధవీడు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మండలంలోని నాగులవరం గ్రామంలో సోమవారం ఉదయం నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. నాగులవరం గ్రామంలోని శ్రీసీతారాములస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## పదోతరగతి ముల్యాంకన పక్రియను పరిశీలించిన కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలులోని డీఆర్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదోతరగతి ముల్యాంకన పక్రియను సోమవారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పరిశీలించారు. చీఫ్ ఎగ్జామినర్లు 113 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 680 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 226 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 680 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 226 మంది, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్స్ 9 మంది మొత్తం 1028 పరీక్ష పేపర్ల మూల్యాంకన పక్రియలో నిమగ్నమై ఉన్నారు. వీరు సుమారు 1,78,218 విద్యార్థుల పేపర్లు దిద్దాల్సి ఉంటుంది. స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు ఇబ్బంది పడకుండా వారికి తగిన సదుపాయాలను కల్పించాలని అలాగే మూల్యాంకన పక్రియ సదుపాయాలను కల్పించాలని అలాగే మూల్యాంకన పక్రియ పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారిణి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్, ఎగ్జామ్స్ ఏసీ శివకుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.

## అద్దంకి నియోజకవర్గానికి 2.30కోట్లతో 7 కమ్యూనిటీ హాల్స్ మంజూరు: మంత్రి గొట్టిపాటి

**అద్దంకి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



అద్దంకి నియోజకవర్గంలో ఏడు నూతన కమ్యూనిటీ హాల్స్ నిర్మించనున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను 2కోట్ల 30లక్షలు రూపాయలు మంజూరైనట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. నియోజకవర్గంలో ప్రాసంగులపాడు, పమిడిపాడు, కుంకుపాడు, మోదేపల్లి, బూదవాడ, కొమ్మినేనివారిపాలెంలో ఎస్సీ వర్గానికి, అలాగే కొమ్మాలపాడులో కాపు సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్స్ కేటాయించడం జరిగిందని తెలిపారు.

## వైభవంగా సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు

**సంతనూతలపాడు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



సంతనూతలపాడులోని పెద్ద బజారులో గత సీతారాముల వారి ఆలయం వద్ద ఆదివారం రాత్రి వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు జరిగాయి. వేద పండితులు పరాంకుశం చక్రవర్తి ఆధ్వర్యంలో అర్చకులు పి.చక్రాచార్యులు, పి.హనుమాను చార్యులు, దివి వెంకటరమణా చార్యులు బృందం సీతారాముల వారికి ఈ కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల వారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎండోమెంట్, దాతలు పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం వేలాది మందికి అన్నదాన వేడుకలు నిర్వహించారు. అనంతరం వేలాది మందికి అన్నదాన వేడుకలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మువ్వల వెంకటేశ్వరస్వామి, కారంశెట్టి చెన్నయ్యశెట్టి, కే.కోటేశ్వరరావు, ఎస్.ఉమా, పి.సుబ్బయ్య, సతీష్, గురునాథం, డి.విశ్వనాథం తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, టీఎన్టీయుసీ అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, సంతనూతలపాడు టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఆర్‌వీ సురేష్‌బాబు, టీడీపీ నాయకులు పావులూరి నారాయణస్వామి, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు దుంపా యల్లమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశువుల నీటితొట్టికి శంకుస్థాపన చేసిన టీడీపీ నేత హరిబాబు

**సంతనూతలపాడు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం మద్దు లూరు గ్రామంలో సోమవారం నాడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల నీటి తొట్టి నిర్మాణానికి మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సురేష్ బాబు, డ్వామా మండల ఏపీవో వాసంతి, కార్యదర్శి శ్రీనివాసరావు, మద్దులూరు గ్రామ టీడీపీ అధ్యక్షులు నవ్వుల మీరయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ నాయకులు దాసరి రవి, నన్నూరి నాగేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేత నరసింహారావును పరామర్శించిన ఎమ్మెల్యే ముత్తుముల

**రాచర్ల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



మండలంలోని గౌతవరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి, టిడిపి సీనియర్ నాయకులు బాకి నరసింహారావును గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం పరామర్శించారు. నరసింహారావు అనారోగ్యానికి గురై చికిత్సలు పొందుతూ ప్రస్తుతం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గౌతవరం గ్రామానికి వెళ్ళి నరసింహారావును పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉంటూ సమయానికి మందులు వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని, నలుగురితో కలిసి ప్రశాంతంగా మాట్లాడుకుంటూ ఒత్తిడి తగ్గించుకోవాలని, సమస్యలు దూరపరచుకోవాలని తెలిపారు. మనసు ప్రశాంతంగా ఉంటే మంచి ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు కటిక యోగానంద్, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## దళితుల భూములు కాపాడాలని మీకోసంలో రాళ్ళవాగు వంతెన బాధితుల వినతి

### - విచారణకు ఆదేశాలిచ్చిన జాయింట్ కలెక్టర్

### - విఆర్‌ఏ నియమించి ప్రభుత్వబోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశాలు

**యర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



రాళ్ళవాగు మీద నిర్మించిన వంతెన, ఆ వంతెన పక్కన కట్టిన పార్కు అన్ని ప్రభుత్వ పోరంబోకు స్థలాలేనని, దళిత పేదలు సాగు చేసుకుంటున్న భూమి లేనంటూ తెలియజేస్తూ ఒంగోలు మీకోసంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బాధితులు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. యర్రగొండపాలెం పట్టణ దాపులో ఉన్న రాళ్ళవాగుపై కొందరు బడాబాబులు అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ అండదండలతో రాళ్ళవాగుకు అవతలివైపున ఉన్న తమ పొలాల్లో వెంచర్లు వేసేందుకు ఏకంగా రెండు కోట్ల స్వంత డబ్బులను వెచ్చించి స్వంతంగా బ్రిడ్జి నిర్మించారు. ఆ వంతెనకు ఏకంగా ఆదిమూలపు సురేష్ వారధి అంటూ పేరును సైతం పెట్టి స్థూపాన్ని నిర్మించి ఆవిష్కరించారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవ అన్న చందంగా పేద, కడుపేద దళితులు సాగు చేసుకుంటున్న రాళ్ళవాగు సర్వే నెంబరు 129/2లో 4.39సెంట్ల ప్రభుత్వ పోరంబోకు భూమిని సైతం తమ పొలంలోకి కలిపేసుకున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ఏపిజి గ్రీన్ అండ్ బ్యూటిషన్ కార్పోరేషన్‌లో రూ.1.50లక్షల నిధులతో ఆ పేదల సాగు భూమిలో పిల్లల పార్కును నిర్మింపజేశారని బాధితులు వాపోయారు. ఆనాటి వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి అయిన సురేష్ అండదండలతో దళితులకు చెందిన మరో 3.30సెంట్ల విలువైన స్థలం కబ్జాకు పాల్పడి కాంపౌండ్ నిర్మించారని ఆరోపిస్తున్నారు. ఆనాటి నుండి తమ పొలం కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకున్న నాదుడే లేదని దీంతో తూమాటి సాలమ్మ, గుర్రం లక్ష్మీనారాయణలు కలిసి ఒంగోలు మీకోసంలో కలెక్టర్‌కు అర్జీలు సమర్పించుకున్నారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే రాళ్ళవాగు వంతెన వెంచర్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు ఇచ్చినట్లుగా బాధితులు చెబుతున్నారు. తీగ లాగితే డొంక కదిలిన చందంగా రాళ్ళవాగు వంతెన వ్యవహారం బట్టబయలు అయ్యేట్లు ఉందని పట్టణంలో చర్చ జరుగుతుంది.

## బీటెక్ ఏఐఎంఎల్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

**వేటపాలెం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**




స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సభ(ఎయాన్ 2కే25) అత్యంత ఘనంగా నిర్వహించాలని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌ఆబు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని, నేడు విద్యార్థులు నిరంతరం నూతన టెక్నాలజీపై దృష్టి సారించి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హరికిషన్ మాట్లాడుతూ రాబోయే కాలం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ దేవనని, ఏఐటూల్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఏఐ టూల్స్‌పై పట్టు సడలిస్తే మీ స్థానంలో వేరొకరు రిప్లేస్ చేయబడతారన్నారు. డీప్‌లెర్నింగ్ ఏఐలో నిరంతరం నూతన ప్రాజెక్ట్ చేయడం నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీఎస్ రావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న పోలీసు కానిస్టేబుల్



**వేటపాలెం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

మండలంలోని దేశాయిపేట ప్రసాద్ నగర్‌లో నివాసం ఉంటున్న బిల్లా రమేష్ వెదుళ్ళపల్లిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయాన్నే ప్రసాద్ పేటలోని తన ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

**టంగుటూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు పట్ల జాగ్రత్తగా ఉండి శుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అశోక్ బాలాజీ, అత్తింటి దివ్యశ్రీ, సిబ్బంది సీహెచ్‌ఓ మాతయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల పోస్టమార్టం నివేదికను బయటపెట్టాలి

**టంగుటూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పగడాల ప్రవీణ్ మృతికి సంఘీభావంగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక పురం సెంటర్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల యాక్సిడెంట్ అని చెబుతున్నారని, పోస్టుమార్టం నివేదికను బయటపెట్టి పోస్టుమార్టం రిపోర్టును బయటపెట్టాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా ఇంకో సోదరులు పాస్టర్ అజయ్‌బాబుని అరెస్టు చేయటం మంచిపద్ధతి కాదని అన్నారు. రాధా మనోహర్ దాస్ లాంటి వాళ్ళు బైబిల్ వక్రీకరించి అసభ్యపదజాలంతో చేస్తున్నప్పటికి వారిపై ఎలాంటి చర్య తీసుకోకపోవడం దుర్మార్గపు చర్య అని అన్నారు. అనంతరం తహశీల్దార్ ఆంజనేయులను కలిసి ఇందుకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూపీఎఫ్ కమిటీ సభ్యులు, పాస్టర్లు సుకుమార్, సుధీర్; జాన్, భాస్కరరావు, డేవిడ్, లివింగ్‌స్టన్, సోహ్, జయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మారెళ్లలో శ్రీసీతారాముల కళ్యాణం

**ముండ్లమూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



మారెళ్లలో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానం నందు శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో ఆలయ ధర్మకర్త గార్లపాటి శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులందరూ కలిసి స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా జరిపించి తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు.

## సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్ స్టాల్‌కు అధికారుల ప్రోత్సాహం

**దర్శి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**




ముండ్లమూరు ఎంపీడీఓ కార్యాలయం దగ్గర ప్రతిసోమవారం ఉదయం 10గంటల నుండి 12 గంటల వరకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కూరగాయాలు, ఆకు కూరల స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇక్కడ పని చేస్తున్న అధికారులు ప్రకృతి వ్యవసాయాధిపతులను కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. కావున అందరికి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తరుపున ధన్యవాదాలు తెలియజేస్తూ వచ్చే సంవత్సరంలో ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని రైతులందరికి మోటివేషన్‌లో భాగంగా ఇక్కడ స్టాల్ నిర్వహిస్తున్నామని అందరికి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందివ్వాలని, భూమి రసయనాలతో పాడైపోతుందని, కావున సేంద్రీయ ఎరువులతో భూమిని ఆరోగ్యంగా కాపాడుకోవాలని ఎంటీ ప్రభాకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జే.ప్రభాకర్, డి.యోగేశ్వరమ్మ, ఎం.కోటయ్య, ఎం.వేణుగోపాల్, పేరయ్య చౌదరి, వెంకట్రావు పాల్గొన్నారు.

## మాజీ సీఎంను కలిసిన యువనేత ఇర్రి కృష్ణారెడ్డి

**పామూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



పామూరు పంచాయతీ రెండో వార్డు మెంబరు వైసీపీ యువజన నాయకుడు ఇర్రి కృష్ణారెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ స్థితిగతులపై జగన్‌కు వివరించారు. పది నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేక వ్యక్తమవుతుండటంపై ఆయనకు తెలియజేశారు. ఎన్నికల ముందు హామీలను ఎన్డీఏ ప్రభుత్వం ఏ ఒక్కటి నెరవేర్చకపోవడంపై అసంతృప్తి నెలకొందని, ఇంత త్వరితగతిన అసంతృప్తి రావడం ఏ పార్టీకి లేదన్నారు. ఏదేదో చేస్తాడని ఎన్డీఏ కూటమిని నిమ్మి ఓట్లు వేసిన ప్రజలు నేడు నెత్తినోరు బాదుకుంటున్నారని జగన్‌కు వివరించారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, 2029లో నల్లేరుపై నడకలాగా తమపార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతుందని తెలిపినట్లు ఇర్రికృష్ణారెడ్డి తెలిపారు.

## ఆరోగ్యవంతమైన జీవనం కోసం మద్యం, దూమపానానికి దూరంగా ఉండాలి

**పొన్నలూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ముఖ్య సందేశంగా ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశజనక భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా పొన్నలూరు మండల పరిధిలో అన్ని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ మల్లిఖార్జున, డాక్టర్ ఉమీర పాల్గొని గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండటానికి కావాల్సిన పద్ధతులను పాటించాలని తెలియజేశారు. మీలో చుట్ట, బీడి, సిగరెట్ తాగే అలవాటున్న వారు ఈ రోజు నుంచి పూర్తిగా మానుకోవాలని, అట్లు కాని పరిస్థితులకు క్యాన్సర్‌కు గురి కావచ్చని తెలియజేశారు. ఊబకాయం కారణంగా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, గుండె జబ్బులు వంటివి రాకుండా ఉండటానికి ఆహార నియమాలు మార్పించాలని హితవు పలికారు.

